# మూఢ నమ్మకాలు

రచన :
శ్రీ ఎస్. వి. రమణ

ఆ రోజు గోస్తానీరివర్ పై నిర్మించిన రైల్వే బ్రిడ్జి పని పూర్తి అయినది. మరునటి దినము దాని ప్రారంభోత్సవము చేయాలి. ఆ కార్యక్రమములో పూర్తిగా నిమగ్నుడయి నాడు డివిజనల్ ఇంజనీరు సుధాకర్.

రెండు పెద్ద పర్వతములను కలుపుతూ వేసిన వంతెన అది. క్రింద గాంభీరంగా పారుతోన్న గోస్తానీ నది వంతెన దాటగానే రైలు కొండ గుహ దాటుతుంది. ఆ దాటే దారిలో ఒక ప్రక్క గంభీరమైన కొండలు, ఒక వైపు పెద్ద పెద్ద లోయలు, ఆ లోయలలో వివిధ రకములైన వృక్షములు, రంగురంగుల పూల పొదలు నదిలోని అలలు రాళ్ళను తాకి వింత శబ్దాన్ని యిస్తున్నాయి.

దినకరుడు క్రమక్రమంగా పడమటి కొండలలోనికి జారుకున్నాడు. పడమర దిక్కున ఆకాశము కనువింతగా చిందూరము పులుముకున్నదా అన్నట్లు రంగు పులుముకొంది. పక్షుల కిలకిలా రావములతో ఆ రోజు ఆహారసంపాదన ముగించుకొని తమ తమ గూళ్ళకు చేరుకొంటున్నాయి. అడవిలోనుండి కట్టెలుకొట్టి మోపులు నెత్తిపై పెట్టుకొని కొండవాళ్ళు యిళ్ళకు బయలుదేరారు. క్రమంగా చీకట్లు ముసురుకొంటున్నాయి.

నిటారైన కొండలు మరింత గంభీరంగా రాక్షసులులా కనుపిస్తున్నాయి. ఆ చీకట్లు అక్కడక్కడ అటవి శాఖ వారు కొండపై వేసిన నెగళ్ళు కొరవి దయ్యాలు మండుతున్నాయి. కొంతసేపటికి రాత్రి చేసే అత్యాచారాలకు తాను సాక్షుడన్నట్లు శశాంకుడు తూర్పున ఉదయించేడు.

డిన్నర్ ముగించి ఇంజనీర్ సుధాకర్ టెంటు బయట కుర్చీలో కూర్చుని సిగరెట్టు ముట్టించి ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తున్నాడు. గాలిలో రింగులు రింగులు పొగ వదలుతున్నాడు.

సుధాకర్ ఇంజనీర్ అయి సుమారు పది సంవత్సరములు పూర్తి కావస్తున్నాయ్. సుశీల అతని భార్య. చక్కని రూపవతి. అత్తగారి సేవలో తన తల్లిని చూసుకొనే సంస్కారవంతురాలు. రవీంద్ర ఒక్కడే సంతానము ఆ దంపతులకు.

ప్రేళ్ళు చుర్రుమనడంలో సుధాకర్ ఈ లోకంలో తాను అటు ఇటు పచార్లు చేస్తున్నాడు. దూరంగా డప్పుల మోత వినబడుతోంది. అది క్రమంగా దగ్గరకొచ్చింది. నెగళ్ళ దగ్గర చలికాగుతున్న డ్రయివర్ అప్పలస్వామిని పిలిచి ఏమిటోయ్ ఆ డప్పులు అంటూ మరియొక సిగరెట్ వెలిగించాడు.

అదా సార్ చెప్పడం మరిచేను. ఈ రాత్రి కొండమ్మ పండుగట. జాతర చేస్తున్నారు దొరా. డాన్సులు కూడ చేస్తారు. అంటూ తలపాగ చుట్టుకొంటు లేచి నిలబడ్డాడు. దొరగారు వెళితే తాను కూడ వెళ్ళవచ్చునని.

ఎంతదూరం వుంటుందోయ్ ఇక్కడికి అని సుధాకర్ ప్రశ్నించాడు.

ఒక ఫర్లాంగు దూరం ఉంటుంది, అన్నాడు అప్పలస్వామి.

జీప్ తీసి బయట పెట్టు అంటూ డ్రెస్ మార్చుకొందుకు టెంటులోకి వెళ్ళాడు సుధాకర్.

ఇరుకైన దారి అగుటచేత జీప్ స్లోగా పోనిస్తున్నాడు డ్రయివర్. వెనుక సీట్లో గ్యాంగుమెన్ గంగులు, కీమెన్ కనకాయి కూర్చున్నారు.

జాతర జరుగుతున్న స్థలానికి ఇరువది గజాల దూరంలో జీప్ ఆపారు.

ఫుల్ సూట్ లో వున్న వ్యక్తిని చూడగానే కొండవాళ్ళంతా గౌరవంగా దండాలు, దండాలు అంటూ చేతులు జోడించేరు.

పొడుగైన మగవాళ్లు, కొంతమంది మెడలో డోలు కట్టుకొని వాయిస్తున్నారు. డాన్సు చేసే వారంతా, పక్షుల ఈకలు రకరకములవి తలకు చుట్టు కిరీటముల వలె కట్టుకున్నారు. మొహములకు ఎరుపు తెలుపు రంగులు కలిపి పులుముకున్నారు. మెడలో రంగురంగుల పూసలు వేసుకున్నారు. పెద్ద పెద్ద రింగులు చెవులకు పెట్టుకున్నారు. కొంతమంది కొమ్ము బూరాలను ఊదుతున్నారు. ఆడా మగా కలిసి డాన్సులు చేస్తున్నారు.

దేవి విగ్రహానికి మొక్కుకున్నారు. కాగడాల వెలుగులో కొండ దేవత మిలమిల మెరుస్తోంది. గాంభీరంగా వుండి భక్తిని ప్రేరేపిస్తోంది ఆ జనానికి.

వలయాకారంగా ఒకరి నడుము ఒకరు పట్టుకొని లయ ప్రకారం ఆడ నారంభించేరు. మధ్య మధ్య కొమ్ముబూర శబ్దం వినిపిస్తోంది. అమ్మవారి విగ్రహం ముందు పూజారి ధూపం వేస్తున్నాడు. కొంత సేపటికి డాన్సు పూర్తి అయింది. పసుపు రాసి కుంకుమలు పెట్టుకొని, మెడలో పూల హారంతో ఒక ముద్దులొలికే చిన్న మేకపిల్ల తీసుకొని రాబడింది, దానిని అమ్మవారి విగ్రహానికి దగ్గరలో

త్రాడుతో ఒక స్థంభానికి కట్టివేశారు. అది భయంతో 'మే మే' అంటూ అరుస్తూంది.

ఇంతలో ఒక పదునైన కత్తి పట్టుకొని పూజారి మేకపిల్ల తలను మొండెమునుండి వేరుచేసేడు. జివ్వు మంటూ ఎర్రటి నెత్తురు దేవి విగ్రహం మీదికి చిమ్మింది. ఆ దృశ్యాన్ని చూడలేక గట్టిగా కళ్ళు మూసుకున్నాడు సుధాకర్.

కొండ వాళ్ళంతా ఆ నెత్తురు బొట్టు పెట్టుకొని ఆ దేవికి దండం పెట్టుకున్నారు.

ఇంక అక్కడ వుండలేక జీప్ మీద టెంటుకి వచ్చి వేశాడు సుధా.

ఆ రాత్రంతా మేకపిల్ల పడ్డ బాధ, అది చేసే ఆర్తనాదం సుధా చెవుల్లో గింగురుమంటూ వినిపిస్తున్నట్లుంది. నిద్ర పట్టలేదు. కళ్లు మూస్తే ఆ దృశ్యమే కనిపిస్తున్నది.

తెల్లవారింది. తాను తలపెట్టిన ఫంక్షన్ అయిపోతే హెడ్ క్వార్టర్స్‌కి వెళ్ళిపోతాడు.

పది గంటలకి ముహూర్తం నిర్ణయించేరు. డ్రెస్ చేసుకొని చీఫ్ ఇంజనీరు, సూపరింటెండెంటుగారి రాకకై ఎదురు చూస్తున్నారు. మిగతా స్టాఫు అంతా తమతమ పనుల్లో నిమగ్నమయినారు.

సరిగ్గా పది గంటల దగ్గరలో చీఫ్ ఇంజనీరు, మిగతా అధికార్లతో బ్రిడ్జి దగ్గరకు వచ్చారు. బ్రిడ్జి ఓపెన్ చేస్తే నది బలికోరుతుందని రిబ్బన్ కట్ చేసేటప్పుడు ఒక గొర్రె పిల్లను బలివేసేరు.

మనము ఇపుడు చంద్రమండలంలో ప్రవేశించి రోదసీలో అనేక విచిత్ర పరిశోధనలు జరుపుతున్న ఈ అణుయుగంలో ప్రజలు తమ మూఢ నమ్మకముతో బలులంటూ అమాయకమైన జీవులను హింసించుతున్నారు. అని ఆలోచిస్తు కూర్చున్న సుధాకర్‌కి జీప్ సడన్ బ్రేకుతో ఆగడంతో ఈ లోకంలోకి వచ్చేడు. జీప్ బంగళా ముందు ఆగింది.

ఎపుడు జీప్ హారన్ వినగానే పరుగెడుతూ వచ్చే తన రవీంద్రు రాకపోయేసరికి, ఏమిటా కారణం అనుకుంటూ ఫైల్ చేత్తో పట్టుకొని దిగి లోపలికి నడిచేడు.

భార్య సుశీల ఎదురై నిన్నటినుండి బాబుకి చాలా జ్వరంగా వుంది, అంటూ దిగులుగా చెప్పింది.

అరె! ఎలా వుందిపుడు అంటూ గబగబ బూట్లు విప్పి లోపలికి వెళ్ళి గదిలో మంచంపై బల్లిలా పడుండిన బాబును చూసి అతని మనస్సు కరిగిపోయింది. బొద్దుగా చక్కగా వుండే రవీంద్ర రెండు రోజుల జ్వరంకి ఎలా అయిపోయాడా అని బాధ కలిగించింది సుధాకర్‌కి.

డాక్టర్‌కి టెలిఫోను చేసేను. బాబు నుదుటపై చేయి వేసి చూస్తే చుర్రుమని తగిలింది.

ఉదయం డాక్టరుగారు వచ్చి ఇంజక్షన్ యిచ్చి వెళ్ళారండి. ఇదేదో క్రొత్త రకం జ్వరమట. మన ప్రక్కయింటి పిన్నిగారు వచ్చి చూసి చెప్పారు. అంటూ కళ్ళనీరు నింపుకొంది సుశీల.

డాక్టరుగారితో నేను మాట్లాడుతానులే. మరి ఏం భయంలేదు. అంటూ బాత్‌రూమ్‌కి స్నానానికి వెళ్ళేడు సుధా.

డాక్టరుగారు వచ్చి చూశారు. మరొక ఇంజక్షన్ యిచ్చి, మరేం ఫరవాలేదులెండి. రెండు, మూడు రోజులలో జ్వరం తగ్గిపోతుంది. అని సుధాకర్‌ని హాస్పటల్‌కి రమ్మని వెళ్ళిపోయాడు.

సుధాకర్ హాస్పిటల్‌కి బయలుదేరాడు. అసిస్టెంటు సర్జన్ పేషెంట్లని వరుసగా పరీక్షించి మందులు వ్రాస్తున్నారు.

మీ బాబుకి జ్వరం ఎలా వుంది. అని అడుగుతూ, ఓ! అయామ్ సారీ. ఇపుడేగా చూసివచ్చింది. ఆ. ఏం లేదు. మామూలు జ్వరమే. కాకపోతే హెచ్చుగా వుండుట వలన గాభరా పడుతున్నారు. అంతే తగ్గిపోతుంది. ఈ మందులు కొని వాడండి అని చీటి వ్రాసి యిచ్చాడు.

సుధాకర్ మందు కొని యిల్లు చేరాడు. మర్నాడు ఆఫీసుకి సెలవు పంపి, బాబు మంచం దగ్గర కూర్చొని టైమ్ ప్రకారము ఆహారము యిస్తున్నాడు.

రెండు రోజులైనా బాబుకి జ్వరం తగ్గలేదు. మెడిసిన్ మార్చాడు డాక్టరు. కాని లాభంలేకపోయింది.

ఆ రాత్రి బాబు కలవరింతలు మొదలుపెట్టేడు. క్రిందటి రోజే ప్రక్కింటి పిన్నిగారు అమ్మవారికి మొక్కుకోమంది. జ్వరం తగ్గితే దేవికి ఒక కోడిపిల్ల యిస్తామని. భర్త ఏమంటాడో అని ఇంతవరకు తటపటాయించింది సుశీల. బాబు ఒక్కడే తమ వంశోద్ధారకుడు.

ESTD : 1969 PHONE 21098

సాటిలేని పంజు టెక్స్

P. టెక్స్ హీరో, హాంక్ కాంగ్ ఫైన్.

మరియు

అనేక రకముల తయారింపులు.

తయారించువారు :

THE PANJU TEXTILES, TIRUPUR-638602.




గతం అంతా కళ్ళముందు సినిమా రీలుగా తిరగ సాగింది.

* * *

సుశీలకు సుధాకర్‌తో వివాహమై పది సంవత్సరాలకి గాని సంతానము కలుగలేదు. అందరూ గొడ్రాలంటూ నిందించడము ప్రారంభించారు. పది సంవత్సరములుదాటి పదకొండవ సంవత్సర ప్రారంభములో వారి కోరిక నెర వేరిందా అని సుశీల గర్భందాల్చింది. భర్త, అత్తగారు తనను ఎంతో గారాభంగా చూసుకుంటున్నారు. అత్త గారు ఏఒక్క పని చేయనీయకుండా తనని అపురూ పంగా చూస్తున్నారు.

క్రమంగా నవ మాసములు పూర్తి అయినవి. డెలివరీ కష్టమని నర్సు చెప్పడంతోనే హాస్పిటల్‌లో జాయిన్ అయినది. వెంటనే లేడీ చీఫ్ సర్జన్ లీలారాణి ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకొని వెళ్ళింది.

బయట వరండాలో సుధాకర్ అటు ఇటు పచార్లు చేస్తున్నాడు. మనస్సు తన ఇష్టదైవమైన వేంకటేశ్వర స్వామికి మొక్కుకున్నాడు. భార్య బిడ్డతో నీ కొండకి వస్తామని.

ఒక అరగంటకి ఆపరేషన్ థియేటర్ తలుపులు తెరుచు కున్నాయి.

కంగ్రాచులేషన్ మిస్టర్ సుధాకర్. మీకు చక్కటి మగపిల్లడు పుట్టాడు, అంటూ యివతలికి వచ్చింది మిసెస్ లీలారాణి.

థాంక్య్! డాక్టర్. నా సుశీల కులాసాగా వుందా? అని ప్రశ్నించాడు సుధాకర్.

ప్రసవము కొంచెము కష్టమైనది. అందువలన ఆపరేషన్ చేసి బిడ్డను తీయవలసివచ్చింది. బిడ్డసంచి దెబ్బ తింది, మరి ఆమె గర్భం ధరించే అవకాశం లేదు. అని చెప్పి, గబగబ తన రూమ్‌లోకి వెళ్ళిపోయింది డాక్టర్ లీలారాణి.

ఒక క్షణం నిశ్చేష్టుడై నిలబడిపోయి, మరల తేరుకుని, పోనీ ఈ ఒక్కబిడ్డ అయినా కులాసాగా ఉంటే అంతే చాలు అనుకున్నాడు సుధాకర్.

ఇంతలో తలుపు తెరచుకొని నర్సు వచ్చి, మీ బిడ్డను చూడవచ్చు సార్! అంటూ మరల లోపలికి వెళ్ళి పోయింది.

లోపలికివెళ్ళి చూశాడు సుధాకర్. తల్లి పొత్తిళ్ళలో వెచ్చగా పండుకొని ఉన్నాడు బాబు. బిడ్డను చూసుకొని మురిసిపోయేడు సుధాకర్. బాబు అంతా మీ పోలికే అంటూ సుశీల నవ్వింది.

అంతా ఆ ఏడుకొండలవాని దయ సుశీల! అంటూ బాబుని సున్నితంగా ముద్దుపెట్టుకున్నాడు.

అవుర్రా! నాయనా! అంటూ సుధాకర్ తల్లి మంచం ప్రక్కన చతికిల బడింది.

తరువాత తను గర్భం దాల్చుటకు అనర్హురాలనని ఎంతో విచారించింది సుశీల. ఒక్కగానొక్క పిల్లడు అవడంవల్ల ముద్దుగా, అతి గారాబంగా పెరిగేడు బాబు.

* * *

గత స్మృతులలోనుండి తేరుకున్న సుశీల గబగబ బాత్‌రూంలోకి వెళ్ళి కాళ్ళు, చేతులు కడుక్కొని వచ్చి బాబు మంచం దగ్గర నిలబడి, తల్లీ గ్రామదేవత! తెల్లవారేసరికి బాబుకి జ్వరం తగ్గితే నీకు ఒక కోడిపిల్లను బలియిచ్చి, పసుపు కుంకుమ సమర్పించుకుంటాను తల్లీ! అని వేడుకొంది.

తెల్లతెల్లవారుతుండగా అమ్మా! అంటూ బాబు కళ్ళు తెరిచాడు.

బాబూ రవీ! అంటూ ఎలా ఉంటుందా అని మంచము పై తలపెట్టి కొడుకు ముఖంలోకే చూస్తూ కూర్చున్న తల్లి, జుట్టులోకి వ్రేళ్ళు పోనిచ్చి తల నిమురుతూ ఎలావుంది బాబు అని లాలనగా అడిగింది సుశీల.

పండురసం తాగు నాయనా! అంటూ కొంచెము చెమ్చాతో నోట్లో పోసింది. రెండుగ్రుక్కలు త్రాగి యింక వద్దు అన్నాడు. వెంటనే బెడ్‌రూంలోకి వెళ్ళి ఏమండీ బాబుకి తెలివి వచ్చిందండీ, కొంచెం పండురసం కూడా త్రాగేడు అంటూ చెప్పింది.

వెంటనే సుధాకర్ లేచి బాబు దగ్గరకి వచ్చాడు. అక్కడే కూర్చున్న నాన్నమ్మతో ఏదో నీరసంగా మెల్లిగా మాటాడుతున్నాడు రవి.

ఆశ్చర్యంగా చూస్తూ, బాబూ! ఎలావుంది అంటూ జ్వరం చూడ్డంకోసం థర్మామీటరు నోటిలో పెట్టి చూశాడు. జ్వరం నార్మల్కు వచ్చింది. నిన్న మందు బాగా పనిచేసింది సుశీ అన్నాడు సుధాకర్.

అబ్బ! ఆ డాక్టర్ మందువల్ల గాదండి! ఆ దేవి చలవనా బాబుని చల్లగ చూసింది. అంటూ రవీంద్ర నుదుటిపైన ముద్దుపెట్టుకుంది సుశీల.

ఆశ్చర్యంగా చూశాడు భార్య ముఖంలోకి. అవునండీ. నేను నిన్నరాత్రి ఆ గ్రామదేవతకు మ్రొక్కుకున్నాను అని తను మ్రొక్కిన విధానమునంతా వివరంగా చెప్పింది భర్తకి సుశీల.

ఎంతపని చేశావు సుశీ! చదువుకున్నదానివి నువ్వు కూడ ఇలా మూర్ఖంగా ప్రవర్తిస్తే ఎలాగ. మందులు యిస్తున్నాము కదా! ఒక్కమారే టెంపరేచర్ తగ్గిపోతుందా? తగ్గడానికి కొంత టైమ్ తీసుకొంటుంది. దయామయి అయిన ఆ దేవి ఎప్పుడైనా ప్రాణంకి, ప్రాణంబలి తీసుకుంటుందా? చెప్పు.

జీవహింస పాపమని తెలియదా నీకు. అని మందలించాడు సుధాకర్ భార్యను.

తప్పండీ! అలా అనకండి! దేవికి కోపం వస్తుంది అని లెంపలేసుకుంది సుశీల.

తాను ఆ రోజు రాత్రి జాతరలో చూసిన దృశ్యం కళ్ళముందు కదలాడింది. తన ఇంటిలో తన భార్య ఒక అమాయక ప్రాణిని బలి యిచ్చిందని ఎంతో బాధపడ్డాడు సుధాకర్.

★

కథాంజలి

[కథల మాసపత్రిక]

స్థాపితం : 1938

విడి ప్రతి...0-40 పైసలు,

సం॥ చందా : రూ. 7-50

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాథమ్స్ బుక్‌స్టాల్సులోనూ దొరుకును.